ప్లాస్టిక్‌పై నియంత్రణ ఏది?

- విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్రజలు
- భవిష్యత్ తరాలు, పశుపక్షాదులకు తీరని నష్టం
- పర్యావరణ పరిరక్షణపై లోపిస్తున్న ముందుచూపు
- నిషేధం అమలుపై అధికారుల్లోనూ కనిపించని చొరవ


పాల్వంచ టీటీడీ కల్యాణ మండపం సమీపాన చెత్తలో కవర్లు తింటున్న పశువు

పాల్వంచ: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ భూతంపై నియంత్రణ కరువైంది. రోజురోజుకూ వినియోగం పెరుగుతుండటంతో కలిగే అనర్థాలను వివరించే వారు లేక ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. దీంతో భవిష్యత్ తరాలకు ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో కొంత మేర ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకున్నా మళ్లీ పరిస్థితులు పునరావృతమయ్యాయి. ఇది ఇలానే కొనసాగితే పర్యావరణం కలుషితమై భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

దైనందిన జీవితంలో భాగంగా..

ప్లాస్టిక్ వినియోగం దైనందిన జీవితంలో భాగమైంది. ఎక్కడికెళ్లినా, ఎక్కడ కూడా పేపర్ బ్యాగులు, గుడ్డ సంచులు వినియోగిస్తున్న దాఖలాలు లేవు. ఏవస్తువు కొన్నా దాని కోసం ప్లాస్టిక్ కవర్‌లను వినియోగిస్తున్నారు. వీటిని ఎక్కడపడితే అక్కడే వేస్తుండటంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. మరో పక్క ప్లాస్టిక్ వినియోగంపై అనర్థాలను వివరించే వారు కానీ, చర్యలు తీసుకునే అధికారులు కానీ కనపించడం లేదు. ఫంక్షన్లు, టీస్టాళ్లు, కర్రీ పాయింట్లు, హోటళ్ల నుంచి తెచ్చుకునే ఆహారంలో ప్లాస్టిక్ కలిసిపోతూ శరీరంలో చేరి వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఇళ్లలో షాంపు ప్యాకెట్లు మొదలు ఇతర అవసరాలకు ప్లాస్టిక్ విచ్చలవిడిగా వాడుతున్నారు. వాడిన వస్తువులను పారిశుద్ధ్య సిబ్బందికి అందించకుండా బయట పడేస్తుండటంతో పర్యావరణం కాలుష్య ఉద్గారాలతో నిండిపోతోంది. పశువులు సైతం ఆహారం కోసం వెతుకులాడే క్రమాన కవర్లు తిని అనారోగ్యం బారిన పడుతున్నాయి. ప్రజల్లో కొంత చైతన్యం ఉన్నా పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై ప్రభుత్వం, జిల్లా అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో తీరని నష్టం వాటిల్లుతోంది.

20 మైక్రాన్ల కంటే తక్కువ ఉంటేనే..

పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల కోసం ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. కానీ, అమలు సాధ్యం కాక.. 20 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను మాత్రమే వినియోగించాలని నిబంధనలు విధించింది. అయితే ఇంత తక్కువ మోతాదు సంచుల వల్ల ఎలాంటి ఉపయోగం ఉండకపోవడంతో అంతకన్నా ఎక్కువ మోతాదులో ఉన్న వాటినే వినియోగిస్తున్నారు. కిరాణా, పాన్ షాపులు, ఇతర అన్ని రకాల దుకాణాల్లో ఈ ప్లాస్టిక్ విక్రయాలు సాగుతుండగా, అన్ని ఫంక్షన్లలో కూడా ప్లాస్టిక్ విస్తరాకులు, గ్లాసులు, కప్పులు, ప్లాస్టిక్ వస్తువులను వాడుతున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

ప్లాస్టిక వాడకం వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తి జీవ రాశుల మనుగడకే ప్రమాదం పొంచి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం. ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు నిర్వహించి అడ్డుకట్ట వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బహిరంగంగా ప్లాస్టిక్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నా అధికారులు తీసుకునే చర్యలు శూన్యమనే చెప్పాలి. దీనిపై స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వాల నుంచి సానుకూల వాతావరణం కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు

ప్లాస్టిక్ వల్ల అనర్థాలెన్నో..

- పడేసిన ప్లాస్టిక్ కవర్లు భూమిలో ఏళ్ల తరబడి కలిసిపోయే పరిస్థితి లేక పర్యావరణం దెబ్బతింటోంది. ఈ కారణంగా గడ్డి, పంట మొక్కలు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు.
- కాల్వలు, డ్రెయినేజీల్లో కవర్లు వేస్తే నీరు ముందుకు సాగడం లేదు.
- వీటిని కాలిస్తే వెలువడే రసాయనాలతో వాయికాలుష్యం ఏర్పడుతుంది.
- పశు, పక్షాదులు వీటిని తినడం వల్ల జీర్ణం కాక అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయి.
- మంచినీటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలవడం వల్ల తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి



ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం ఉంది. ఈ అంశంలో దుష్పరిణామాలపై ప్రజలు చైతన్యవంతులు కావాలి. అధికారులు పట్టణాలు, గ్రామాల్లో ప్లాస్టిక్ వల్ల నష్టాలను వివరించాలి. అలాగే, ప్రజలు ఇళ్లలో వాడే కవర్లను మున్సిపాలిటీ సిబ్బందికే ఇవ్వాలి.

–చలువాది ప్రకాష్, వర్తక సంఘం కన్వీనర్

నివారణకు చర్యలు తీసుకోవాలి



ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేలా అధికారులు తనిఖీలు విస్తృతంగా చేపట్టాలి. ప్రజల్లోనూ పర్యావరణ సమతుల్యతపై అవగాహన కల్పించాలి. ఇప్పటికే తినే ఆహారం నుంచి పీల్చే వాయువు వరకు అన్ని విషయాల్లో ప్లాస్టిక్ ఉన్నందున ఇకనైనా మేల్కొనాలి.

–రమేశ్‌రాథోడ్, గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు

క్లుప్తంగా

టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గంతో రాములునాయక్

జూలూరుపాడు: టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక సోమవారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా గుగులోత్ సీతారాములు, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ హనుమా, కోశాధికారిగా జర్పుల కృష్ణ, మహిళా అధ్యక్షురాలిగా ధరావత్ స్వరూపారాణి, గౌరవ అధ్యక్షులుగా బానోత్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రాథోడ్ ప్రకటించారు. కార్యక్రమంలో బానోత్ శ్రీను, సపావత్ బాలకృష్ణ చౌహాన్, నేతాజీ, శంకర్, వీరయ్య, గోపాల్, శ్రీను, పెంటయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని ముకుందాపురం సర్కిల్ నిజాంపేట అంగన్‌వాడీ పాఠశాల ఆయా జయమ్మ సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా సీఐటీయూ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్ల హక్కుల సాధన కోసం యూనియన్ నిర్వహించిన ఉద్యమాల్లో జయమ్మ పాల్గొన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, రాంబాయి, మరియ, రమణ, ఇస్తారా, వెంకటమ్మ, చంద్రకళ తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో 2020–2025 పాలవర్గ వీడ్కోలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు మాట్లాడారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రజల్లోనే నిత్యం ఉంటూ వారికి సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, మేనేజర్ ప్రసాద్, డీఈ రవికుమార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన ఎట్టి నరేశ్ ఈ నెల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించి ఆర్థిక చేయూతనందించారు. కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.

బస్ షెల్టర్లకు నిధులు

జూలూరుపాడు: మండల కేంద్రంలో రెండు బస్ షెల్టర్ల నిర్మాణానికి సింగరేణి సంస్థ రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.లక్ష్మణ్ సోమవారం తెలిపారు. తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రయాణికుల సౌకర్యార్థం రెండు బస్ షెల్టర్లను నిర్మించనున్నామని, స్థలాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

ఎల్‌హెచ్‌పీఎస్ లీగల్ అడ్వైజర్‌గా రాధాకృష్ణ


ధరావత్ రాధాకృష్ణ

కొత్తగూడెంటౌన్: లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) కొత్తగూడెం లీగల్ అడ్వైజర్‌గా న్యాయవాది ధరావత్ రాధాకృష్ణను నియమించారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ సోమవారం తనకు నియామకపత్రాన్ని అందజేశారని రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

వచ్చేనెల 5 నుంచి క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: ఫిబ్రవరి 5 నుంచి వెంకట్యాతండా ప్రీమియర్ లీగ్ సీజన్–1 క్రికెట్ టోర్నమెంట్ ఉంటుందని నిర్వాహకులు షేక్ ఇంతియాజ్, ఆంగోతు చందూలాల్, భూక్య రాజేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఎంట్రీలు అందజేయాలని, ఎంట్రీ ఫీజు రూ.2 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3న డ్రా ఉంటుందని, విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు అందజేస్తామని, టేకులపల్లి మండలానికి చెందిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఉంటుందని, వివరాలకు 9573201091 (ఇంతియాజ్), 9908304671 (ఆంగోతు చందూలాల్), 8897891420 (భూక్య రాజేశ్) నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంఘం ఏర్పాటులో కీలకం..

టేకులపల్లి/ఇల్లెందురూరల్: పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకుడు జటంగి వెంకన్న ఆశయ సాధనకు కృషి చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాసుద్దీన్, జిల్లా అధ్యక్షుడు సారంగపాణి పిలుపునిచ్చారు. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీలో సోమవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో జటంగి వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రగతిశీల పంచాయతీ వర్కర్ల సంఘం ఏర్పాటులో వెంకన్న క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రామెళ్ల మోహన్‌రావు, రామకృష్ణ, కుంజ శ్రీను, ఈసాల రంజిత్, వెంకటేశ్వర్లు, రాజు, సర్వయ్య, వెంకన్న, రుద్రయ్య పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కార్యాలయం, కార్పొరేట్ కార్యాలయం, పీవీకే–5 ఇంక్‌లైన్, జీకేఓసీల్లో ఆ సంఘం 23వ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో గులాబీ జెండాను ఎగురవేశారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం ఎంతో కృషి చేసిందన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వలేకపోవడంతోపాటు రెండు కోడిగుడ్లు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నాయని దుయ్యబట్టారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వంట కార్మికులకు కనీస వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లకు ఇచ్చే ధరను పెంచాలని, ప్రతి పాఠశాలలో వంట షెడ్లు నిర్మించాలని కోరారు. కట్టెలపొయ్యిలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, బండి నాగేశ్వరరావు, వైఎస్ గిరి, యాకూబ్, ఎండూరి ప్రభావతి, పాదల మంగ, వహేద, పద్మ, బుజ్జమ్మ, సరోజ, స్వప్న, శిరీష, బేగం, సుజాత, ముత్యాల అరుణ, నర్సమ్మ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి జీఎం అభినందన


నిఖితను అభినందిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): అండర్–17 జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాణించిన రుద్రంపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థిని నిఖితను జీఎం ఎం.శాలేంరాజు సోమవారం అభినందించారు. తన చాంబర్ జరిగిన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, ఒడిశా జట్టుపై విజయం సాధించడానికి కారణమైన నిఖిత.. భవిష్యత్‌లోనూ బాగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, ఎస్‌వోటూ జీఎం కోటిరెడ్డి పాల్గొన్నారు.

రాగి గనులు పునరుద్ధరించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న రాగి గనులను పునరుద్ధరించి, ఆదివాసీ, గిరిజనులకు ఉపాధి కల్పించాలని బీజేపీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీనాయక్ బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో కేంద్రమంత్రిని కలిసిన ఆయన మాట్లాడారు. మైలారంలో 40 ఏళ్ల కిందట రాగి గనులు ఉండేవని, వాటిని మూసివేయటం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో శంభు, సీతారాంనాయక్, హతిరామ్‌నాయక్, బాలాజీనాయక్, శ్రీనివాస్‌నాయక్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి..


టేకులపల్లి: వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ బాధ్యులు

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి యూపీఎస్ (ఏకీకృత పెన్షన్ స్కీమ్)ను అమలు చేయనున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) యూపీఎస్‌కు మార్చకుండా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బీఎం విజయనిర్మల కోరారు. సంఘం ఆధ్వర్యంలో నాయకుల బృందం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ముత్తయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టి.రవీందర్, మోతీలాల్, రమేశ్‌బాబు, రమణ, పన్నాలాల్, నాగునాయక్, స్వామి, గురుప్రసాద్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

జూలూరుపాడు: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పీఆర్‌టీయూటీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కె.స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌తో ఉపాధ్యాయ, ఉద్యోగులకు మేలు జరగదని, రాష్ట్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో చింతపల్లి ప్రభాకర్, పుల్లారావు, కృష్ణ, పటేల్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏఎల్‌ఎంకు ఉత్తమ అవార్డు



ప్రశంసాపత్రం అందుకుంటున్న ముజాబీర్

టేకులపల్లి: మండలంలోని తొమ్మిదో మైలుతండా అసిస్టెంట్ లైన్‌మెన్ (ఏఎల్‌ఎం)గా పనిచేస్తున్న అబ్దుల్ ముజాబీర్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు వరించింది. వరంగల్‌లోని విద్యుత్ సౌధలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం డైరెక్టర్ ప్రశంసాపత్రం అందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పాల్వంచరూరల్: గ్రామ సమాఖ్యల పరిధిలో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజ్ అసిస్టెంట్ల (వీఓఏ)కు ఉద్యోగ భద్రతను కల్పించి సమస్యలను పరిష్కరించాలని వీఏఓల జేఏసీ గౌరవ అధ్యక్షులు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి కొమరంభీమ్ భవనంలో సోమవారం జిల్లాస్థాయి వీఓఏల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం వీఓఏల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాశ్వత గౌరవాధ్యక్షులుగా పృథ్వీరాజ్, శ్రీనుగోపాల్, అధ్యక్షుడిగా పవన్, ఉపాధ్యక్షులుగా రమేశ్, నిర్మల, ప్రధాన కార్యదర్శిగా జున్ను సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

పుస్తకాలు పంపిణీ

పాల్వంచ: భారతదేశ రాజ్యాంగ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిల భారత ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం గౌరవ అధ్యక్షులు కాల్వ భాస్కర్ ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాల్వ ప్రకాష్ రావు, రాజేందర్, వాసుమల్ల సుందర్‌రావు, జూపుడి ప్రభాకర్, కొప్పుల వెంకన్న, కోళ్లపూడి ప్రవీణ్, గండూరి శ్రీను పాల్గొన్నారు.

మాంసం దుకాణం తొలగించాలి

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన శివాలయం పక్కన మాంసం దుకాణాన్ని తొలగించాలని జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల భక్తులు అధికారులను కోరారు. గణతంత్ర దినోత్సవం నాడు కూడా మాంసం దుకాణం నడపటంతో పాటు ప్రశ్నిస్తే రౌడీలతో దాడులు చేయిస్తున్నాడని పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఓల్డ్ డిపో వద్ద మైనార్టీ కార్యాలయంలో సోమవారం ఉర్దూ ఘర్ చైర్మన్ నహీమ్‌ఖురేషీ మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన మదార్సా అరబియా ఇమ్దాదుల్ ఉలూమ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షరీఫ్, జావిద్, హమీద్, అమర్, జమాల్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా రవికిరణ్


వాసవీక్లబ్ నూతన కమిటీని సత్కరిస్తున్న సభ్యులు

ఇల్లెందు: వాసవీక్లబ్ నూతన అధ్యక్షుడిగా బోనగిరి రవికిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఇల్లెందులోని ఆర్య వైశ్యసత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ కె.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2025 ఏడాదికి అధ్యక్షుడిగా బోనగిరి రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా కటకం సత్యేంద్రకుమార్, కోశాధికారిగా తీర్థాల నాగరాజుతోపాటు కార్యవర్గ సభ్యుల చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఐబీ డీఈ రవికుమార్, హరిహర క్షేత్రం చైర్మన్ గండె సదానందం, వాసవీ క్లబ్ సభ్యులు చిదిరాల లింగయ్య, గుంటుపల్లి దివాకర్‌గుప్తా, మాషెట్టి వరప్రసాద్, అర్వపల్లి రాధాకృష్ణ, కుర్తి రాజమనోహర్, ధీమాకుర్తి నాగరాజు, తరుణ్, జనార్దన్, రోశయ్య, సతీశ్‌కుమార్, మధుబాబు, సైఫా రాజశేఖర్, పుల్లూరు జ్యోతి, అనుబాబు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కుష్ఠువ్యాధిపై అవగాహన


మాట్లాడుతున్న బాలాజీనాయక్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్ఠువ్యాధిపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని యాంటీ లెప్రసీ డే జరుపుకుంటామని, అందులో భాగంగా తొలిరోజు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, బాలాజీనాయక్, భద్రు, ఫయాజ్, సంధ్య, శ్రీనివాసరావు, గన్యా, కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులను కాపాడాలి


మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్: భారత రాజ్యాంగాన్ని గౌరవించి షెడ్యూల్డ్ ఏరియా గిరిజన హక్కులను కాపాడాలని, జీఓ–3 స్థానంలో కొత్త జీఓ తీసుకురావాలని తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. సోమవారం కొత్తగూడెంలో ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించి.. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా వాంకుడోత్ రమేశ్‌బాబు, జిల్లా అధ్యక్షులుగా భూక్య శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా గోల్డ్ వీరన్నను ఎన్నుకున్న అనంతరం లక్ష్మణ్‌నాయక్ మాట్లాడారు. ఉద్యోగ విరమణ వయసు పెంపు ఆలోచనను విరమించి 58 ఏళ్లకు కుదిస్తే యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలోని 44 ఏజెన్సీ మండలాలల గిరిజనుల హక్కులను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వి.హాతీరాం, యం.బిచ్చ, బి.శంకర్, శోభన్, ఎ.బన్సీలాల్, బిచ్చా, హరి, బాలు, రమేశ్, రామ్‌సింగ్, వీరన్న, రవికుమార్, కిషన్, హీరాలాల్, పూల్సింగ్, నర్సింహారావు పాల్గొన్నారు.

‘లక్ష డప్పులు’ను జయప్రదం చేయండి


డప్పు కొడుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇల్లెందు: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే ‘లక్ష డప్పులు – వేల గొంతులు’ కార్యక్రమానికి ఊరువాడా తరలి వెళ్లి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మెంతెన వసంతరావు కోరారు. సోమవారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం సాగుతోందని, తుది దశకు చేరిన ఉద్యమాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న కుట్రలను ఛేదించేందుకు శాంతియుత పోరాటం సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, బాబు, అశోక్, మధు, లాజర్, కిరణ్, భాస్కర్, పి.వెంకటేశ్వర్లు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.